ప్రజాపాలన దరఖాస్తుల ఎంట్రీ 17 నాటికి పూర్తి

- ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన
- జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడి

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీలను ఈ నెల 17వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. బుధవారం కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 6న ప్రజాపాలన ముగిసిన వెంటనే దరఖాస్తుల డాటా ఎంట్రీ ప్రక్రియ చేపట్టి పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లోని డీటీపీ ఆపరేటర్ల సేవలను ఉపయోగించుకోవాలని, అవసరమైతే ప్రైవేట్ వ్యక్తులను నియమించుకోవాలని సూచించారు. డాటా ఎంట్రీలో ఆధార్‌నంబర్, రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని స్పష్టంచేశారు. తాసిల్దార్లు, ఎంపీడీవోల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరగాలని, సూపర్వైజరీ అధికారిగా ఉన్న జిల్లాస్థాయి అధికారి పర్యవేక్షించాలని సూచించారు. డాటా ఎంట్రీ కోసం రాష్ట్రస్థాయిలో ట్రెయినీ ఆఫ్ ట్రైనర్లకు గురువారం శిక్షణ ఇస్తామని, వారు శుక్రవారం నుంచి జిల్లాస్థాయిలో శిక్షణ ఇస్తారని చెప్పారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పుడు ఇవ్వని వారు మరోసారి దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నవీన్‌మిట్టల్, సందీప్‌కుమార్ సుల్తానియా, రోనాల్డ్ రోస్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



తెలిమంచు తెరలో ఇల వైకుంఠం

లక్ష్మీనారసింహుడు కొలువైన యాదగిరిగుట్టపై బుధవారం పొగమంచు దట్టగా కమ్ముకున్నది. తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు గుట్ట మంచు కౌగిలో మురిసిపోయింది. మంచుతెరల్లో ఆలయ పరిసరాలు ఆహ్లాదం పంచుతూ అత్యద్భుతంగా దర్శనమిచ్చాయి. ఆ దృశ్యాన్ని చూస్తూ భక్తులు మైమరచిపోయారు. – నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి జిల్లా

ఎన్నికల ఆయుధంగా అయోధ్య అంశం

- సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): అయోధ్య రామాలయ అంశాన్ని ప్రధాని మోదీ వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ విమర్శించారు. హైదరాబాద్ మగ్దూంభవన్‌లో బుధవారం ప్రారంభమైన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రమాదకరంగా మారిందని, సంస్థాగత వ్యవస్థలను నియంత్రిస్తున్నదని విమర్శించారు.

గండుగులపల్లిలోని సీతారామ ప్రాజెక్ట్ 4వ పంప్‌హౌజ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. చిత్రంలో ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక ఆల

'సీతారామ' పనుల్లో వేగం పెంచండి

- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలకు నీరివ్వాలి
- ఇరిగేషన్ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- గండుగులపల్లిలో ప్రాజెక్ట్ నిర్మాణ పనులపై సమీక్ష

అశ్వారావుపేట, జనవరి 3: సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక ఆలతో కలిసి భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి సమీపంలోని ప్రాజెక్ట్ 4వ పంప్‌హౌజ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు. నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం అంచనా రూ.13,500 కోట్లు కాగా.. ఇప్పటివరకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రికి ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డి వివరించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తయితే సత్తుపల్లి ట్రంక్, లంకాసాగర్ ప్రాజెక్టుకు నీరు అందే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ ఏడాది వర్షాకాలం నాటికి వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు గోదావరి జలాలను అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే మొత్తం 6.74 లక్షల ఎకరాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుందని తుమ్మల వెల్లడించారు. మంత్రి వెంట ఇరిగేషన్ ఎస్ఈలు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఈఈలు అర్జున్, శ్రీనివాస్, సురేశ్ తదితరులు ఉన్నారు.

సీఎంతో 'అదానీ' భేటీ

- అమర్‌రాజా, ఆదానీ గ్రూప్‌లకు సీఎం రేవంత్‌రెడ్డి భరోసా
- మరిన్ని పెట్టుబడులు: అమరరాజా
- ఏరోస్పేస్ పార్కు, డాటా సెంటర్ ప్రాజెక్టులపై ఆదానీ గ్రూప్ చర్చలు

సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న గల్లా జయదేవ్. చిత్రంలో ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి అన్నివిధాలా సహకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ, ఆదానీ గ్రూప్ ప్రతినిధులు బుధవారం సచివాలయంలో సీఎంను కలుసుకొని చర్చలు జరిపారు. అమరరాజా సంస్థ మహబూబ్‌నగర్‌లోని దివిటిపల్లిలో లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి సంబంధించిన గిగా ప్రాజెక్టును నెలకొల్పుతున్నది. ఈ పనుల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కంపెనీ సీఎండీ గల్లా జయదేవ్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధిలో అమరరాజా కీలక భాగస్వామి అని అన్నారు. కంపెనీ తలపెట్టిన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన సహాయ సహకారాలను అందిస్తుందని భరోసా ఇచ్చారు. తమ ప్రాజెక్టును వేగంగా అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న మద్దతుకు గల్లా జయదేవ్ సీఎంకు అభినందనలు తెలిపారు. న్యూ ఎనర్జీ, లిథియం అయాన్ బ్యాటరీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల తోపాటు వివిధ రంగాలలో తెలంగాణలో మరిన్ని పెట్టుబడులకు తమ కంపెనీ సిద్ధంగా ఉన్నదని చెప్పారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. పెరుగుతున్న ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎనర్జీ స్టోరేజ్ మార్కెట్‌కు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీని ప్రవేశపెట్టేందుకు దివిటిపల్లిలో గిగా కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా దేశంలోనే పెద్దదైన అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ), లిథియం-అయాన్ బ్యాటరీ తయారీ ఫ్యాక్టరీని నెలకొల్పుతున్నదని అన్నారు. న్యూ ఎనర్జీ పార్క్, బ్యాటరీ ప్యాక్ అసెంబ్లింగ్ యూనిట్, ఈ-పాజిటివ్ ఎనర్జీ ల్యాబ్స్ పేరుతో రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మొత్తంగా రూ.9,500 కోట్ల పెట్టుబడులకు కంపెనీ ముందుకొచ్చిందని అధికారులు తెలిపారు. దీంతో దాదాపు 4,500 మందికి ప్రత్యక్షంగా, అంతేస్థాయిలో పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నాం

తెలంగాణలో పెట్టుబడులకు తాము సిద్ధంగా ఉన్నట్టు అదానీ గ్రూప్ తెలిపింది. పోర్ట్స్ సెజ్ సీఈవో, గౌతమ్ అదానీ పెద్ద కుమారుడు కరణ్ అదానీ, అదానీ ఏరోస్పేస్ సీఈవో ఆశిష్ రాజ్‌వంశీతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు జరిపారు. పారిశ్రామిక అభివృద్ధికి, ఉపాధి కల్పనకు, కొత్త పరిశ్రమలకు తెలంగాణ ప్రభుత్వం తగినన్ని వసతులు, రాయితీలు కల్పిస్తుందని ఈ సందర్భంగా సీఎం భరోసా ఇచ్చారు. అదానీ గ్రూప్ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం మారినప్పటికీ తెలంగాణలో పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనకు తమ కంపెనీ ముందుంటుందని అదానీ గ్రూప్ ప్రతినిధులు చెప్పారు. రాష్ట్రంలో ఏరోస్పేస్ పార్కుతోపాటు డాటా సెంటర్ ప్రాజెక్టు నెలకొల్పేందుకు అదానీ గ్రూప్ ప్రభుత్వంతో చర్చలు జరిపింది. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసిం, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు షర్మిల ఆహ్వానం

- కొడుకు పెండ్లికి రావాలని పిలుపు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): తన కుమారుడి వివాహానికి ఆహ్వానించేందుకు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల బుధవారం ఏపీ సీఎం, తన సోదరుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. ఆమె వెంట భర్త అనిల్, తల్లి విజయమ్మ, కుమారుడు వైఎస్ రాజారెడ్డి కూడా ఉన్నారు. తన ఇంట్లో జరుగనున్న తొలి శుభకార్యానికి హాజరుకావాలని వారు జగన్ దంపతులను కోరారు. సోదరుడితో విభేదాలు ఏర్పడినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వైసీపీ నుంచి దూరమైన షర్మిల తెలంగాణలో వైఎస్సార్‌టీపీ పార్టీని స్థాపించిన సంగతి తెలిసిందే. చాలాకాలం తరువాత సోదరుడిని షర్మిల కలుసుకోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. విమానాశ్రయం వద్ద షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. 'పెళ్లి కదా! బ్రో కి చెప్పటానికి వచ్చాను' అని అన్నారు. అక్కడి నుంచి ఆమె నేరుగా ఢిల్లీ వెళ్లారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు ఇదివరకే వెల్లడించిన షర్మిల గురువారం ఢిల్లీలో పార్టీ పెద్దల సమక్షంలో కండువా కప్పుకోనున్నట్టు తెలిసింది. షర్మిలతోపాటు జగన్ ఇంటికి వెళ్లిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తాను కూడా కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రకటించారు.

నేడు కేసీఆర్‌కు జగన్ పరామర్శ

ఇటీవల గాయపడి కోలుకుంటున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావును ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పరామర్శించనున్నారు. హైదరాబాద్‌కు గురువారం రానున్న జగన్ నేరుగా కేసీఆర్ ఇంటికి వెళ్లనున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల అనంతరం కేసీఆర్ గాయపడిన సంగతి తెలిసిందే. తుంటి ఎముక శస్త్రచికిత్స అనంతరం ఆయన కోలుకుంటున్నారు.

బీసీల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): బీసీల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆ మేరకు విద్య, ఉపాధి అవకాశాల్లో బీసీలకు సరైన అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. బీసీ వర్గాలను సామాజికంగా బలోపేత చేయడానికి నిబద్ధతతో పనిచేయాలని కోరారు. బీసీలకు సంక్షేమ ఫలాలను అందించడం అదృష్టంగా భావించాలని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ పనితీరు, గురుకుల విద్యాలయాలు, బీసీ కార్పొరేషన్ రుణాలు, ఆత్మగౌరవ భవనాలు, ఫెడరేషన్లకు సంబంధించిన అనేక అంశాలపై మంత్రి సమీక్షించారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, అడిషనల్ సెక్రటరీ పద్మ, ఎంబీసీ సీఈవో అలోక్‌కుమార్, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్యభట్టు, చంద్రశేఖర్, సంధ్య, విమల, శ్రీనివాస్‌రెడ్డి, మద్దిలేటి, మంజుల, ఉదయ్ ప్రకాశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఢిల్లీకి సీఎం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డి గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం జరగనున్నది. దీనికి అన్ని రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ సీఎంలు హాజరుకానున్నారు. రేవంత్ కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించనున్నారు.

నేడు అద్దె బస్సుల యాజమాన్యాలతో చర్చలు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ అద్దెబస్సుల యాజమాన్యాలతో గురువారం ప్రభుత్వం చర్చలు జరపనుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆర్టీసీ అద్దె బస్సుల యాజమాన్యాలు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. ఈ మేరకు బుధవారం టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అద్దెబస్సుల యాజమాన్యాల సంఘం ప్రతినిధులకు ఫోన్ చేసి చర్చలకు ఆహ్వానించారు. దీంతో సంఘం ప్రతినిధులు ప్రభుత్వం ముందు రెండు డిమాండ్లను ఉంచారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేస్తున్నది. ఈ చర్చ ల్లో తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే 5 నుంచి తాము తలపెట్టిన సమ్మెను వాయిదా వేస్తామని, లేనిపక్షంలో సమ్మెను యథావిధిగా కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

మంత్రి పొంగులేటి గృహప్రవేశం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బంజారాహిల్స్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో తనకు కేటాయించిన భవనంలో బుధవారం గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ కలెక్టర్ల సంఘాల ప్రతినిధులు చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకళ, చంద్రయ్య, లచ్చిరెడ్డి తదితరులు మంత్రిని శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యామ్నాయ ఆదాయంపై ఆర్టీసీ దృష్టి

- సంస్థ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవాలి
- ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తాం
- నేటికి 6.50 కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణం
- డిప్యూటీ సీఎం భట్టి, రవాణా శాఖ మంత్రి పొన్నం

ఆర్టీసీపై సమీక్ష సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టికి మొక్క అందజేస్తున్న మంత్రి పొన్నం. చిత్రంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై టీఎస్ఆర్టీసీ దృష్టి పెట్టాలని, సంస్థ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. సచివాలయంలో బుధవారం ఆర్టీసీపై రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి పూర్తిస్థాయి సహాయ, సహకారాలు అందిస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. మహాలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 6.50 కోట్ల మంది మహిళలు ప్రయాణాలు సాగించారని వివరించారు. నిర్వహణ నిధులను సంస్థకు సకాలంలో సమకూర్చాలని ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. సిబ్బందికి రావాల్సిన బకాయిలు, సంస్థ అప్పులు, పీఎఫ్, సీసీఎస్, ఇతర సెటిల్‌మెంట్లకు సంబంధించిన నిధులపై సమీక్షించి, త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రజల సంస్థ అని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. సంస్థ బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. లాజిస్టిక్స్, కమర్షియల్ ఆదాయం పైనా సంస్థ దృష్టి పెట్టిందని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతిరోజు సగటున 27 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని, దాదాపు రూ.10 కోట్ల విలువైన జీరో టికెట్లను మంజూరు చేస్తున్నామని ఆర్టీసీ ఉన్నతాధికారులు మంత్రులకు వివరించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, టీఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, డిప్యూటీ సీఎం ఓఎస్డీ కృష్ణభాస్కర్, ఆర్టీసీ ఈడీలు ముని శేఖర్, కృష్ణకాంత్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయ పుష్ప, సీఎంఈ రఘునాథరావు, సీటీఎం జీవన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతరకు నిధులివ్వండి

- డిప్యూటీ సీఎం భట్టికి మెస్రం వంశస్థుల వినతి

హైదరాబాద్, జనవరి3 (నమస్తే తెలంగాణ): కేస్లాపూర్ నాగోబా జాతర నిర్వహణకు నిధులు విడుదల చేయాలని డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు మెస్రం వంశస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జుతో కలిసి సచివాలయంలో భట్టికి వినతి పత్రం అందజేశారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా నాగోబా ఆలయాన్ని సందర్శించిన భట్టి ఇచ్చిన హామీలు తీర్చాలని కోరారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరిస్తామని, నాగోబా ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. త్వరలోనే ఆలయాన్ని సందర్శిస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

250 యూనిట్ల ఉచిత విద్యుత్తు కొనసాగించండి

- మంత్రి పొన్నంకు నాయీ, రజక సంఘాల నేతల వినతి

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): సెలూన్లకు, ధోబీఘాట్లకు గత ప్రభుత్వం ఇచ్చిన 250 యూనిట్ల ఉచిత విద్యుత్తును యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వానికి నాయీబ్రాహ్మణ సేవా సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణతోపాటు పలువురు నాయకులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో నాయీబ్రాహ్మణ సమాజంతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై మాట్లాడతామని మంత్రి హామీ ఇచ్చినట్టు సంఘం నేతలు వెల్లడించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడల రాజు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

ధూపదీప నైవేద్యానికి 12 వేలు ఇవ్వాలి

- డిప్యూటీ సీఎం భట్టికి అర్చక ఉద్యోగ జేఏసీ వినతి

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ధూప, దీప నైవేద్యం పథకానికి నెలకు రూ.12 వేల చొప్పున ఇవ్వాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ కోరింది. జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆయనను ప్రజాభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అర్చక ఉద్యోగులకు జీవో 577 ప్రకారం 5,625 మందికి ఇవ్వాల్సి ఉండగా 3 వేల మందికి మాత్రమే రాష్ట్ర ఖజానా నుంచి వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. దేవాదాయశాఖ ఇచ్చిన 121 జీవోను రద్దు చేయాలని కోరారు. అన్యాక్రాంతమైన ఆలయాల భూములను స్వాధీనం చేసుకొని వాటిని వేలం ద్వారా విక్రయిస్తే గణనీయమైన ఆదాయం సమకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో కొండగట్టు, వేములవాడ, కాళేశ్వరం, బాసర, భద్రాచలం, యాదాద్రి అర్చకులు, ఉద్యోగులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి కురాకుల, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, ఉద్యోగులు జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివకుమార్, దేవాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కొండూరి కృష్ణమాచారి, అధ్యక్షుడు భద్రినారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీల అమలుకు ఇందిరమ్మ కమిటీలు

- ఒక్కో కమిటీలో ఐదుగురు కాంగ్రెస్ నేతలకు చోటు
- టీపీసీసీ కార్యకవర్గ భేటీలో నిర్ణయం
- కాంగ్రెస్ కార్యకర్తలతోనే కమిటీలు
- లోక్‌సభ ఎన్నికలకు రూట్ మ్యాప్
- 12 సీట్లు లక్ష్యంగా పార్టీ అడుగులు
- ఈ నెల 8వ తేదీ నుంచి కార్యాచరణ
- త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ

కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి తనతోపాటు గాంధీభవన్‌కు వచ్చిన నాయకులను అనుమతించకపోవడంతో పోలీసులతో మల్లురవి వాగ్వాదం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల అమలుకు గ్రామస్థాయిలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఒక్కో కమిటీలో ఐదారుగురు సభ్యులు ఉండనుండగా, కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలనే నియమించనున్నది. వీరంతా ప్రభుత్వానికి, పార్టీకి మధ్య వారధులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి మీడియాకు వెల్లడించారు. ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అదేవిధంగా పెట్టుబడుల కోసం ఈ నెల 14న సీఎం సహా మంత్రి శ్రీధర్‌బాబు దావోస్ వెళ్లనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మూడు తీర్మానాలను ఆమోదించారు. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జిగా నియమితులైన దీపాదాస్ మున్షీకి స్వాగతం పలకటంతో పాటు గత ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రేకు అభినందనలు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఆ పార్టీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ పోటీ చేయాలని తీర్మానం చేశారు.

మల్లు రవికి గాంధీభవన్‌లోకి నో ఎంట్రీ!

కార్యవర్గ సమావేశం సందర్భంగా ఆ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవికి చేదు అనుభవం ఎదురైంది. ఆయనను పోలీసులు గాంధీభవన్‌లోకి రాకుండా అడ్డుకున్నారు. గాంధీభవన్ వర్గాలు ఇచ్చిన జాబితా ప్రకారమే నేతలను లోపలికి అనుమతించగా, ఆ జాబితాలో ఆయన పేరు లేకపోవడంతో పోలీసులు ఆయనను లోపలికి పంపలేదు. దీంతో ఆయన పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. తననే అడ్డుకుంటారా? అని హంగామా చేయటంతో అక్కడ కొద్దిసేపు గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. గాంధీభవన్‌లోకి అనుమతించని పార్టీ ఇతర నేతలు, కార్యకర్తలు కూడా తీవ్ర అసహనానికి గురయ్యారు. అధికారంలోకి వచ్చాక తమను గేటు వద్దే ఉంచేస్తారా? అని పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

టార్గెట్ 12 సీట్లు

సమావేశంలో లోక్‌సభ ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏ విధంగా ముందుకు వెళ్లాలనేదానిపై కార్యాచరణ రూపొందించారు. 12 స్థానాలకు తగ్గకుండా ఎంపీ సీట్లు గెలుచుకోవాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఈ మేరకు పార్టీ నేతలకు రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 8, 9 తేదీల్లో రోజుకు ఐదు ఉమ్మడి జిల్లాల చొప్పున సమీక్షిస్తానని తెలిపారు. 11, 12, 13 తేదీల్లో ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఇన్‌చార్జీలు, మంత్రులు సమావేశాలు ఏర్పాటు చేసి అభ్యర్థుల గెలుపు కోసం ఏం చేయాలనేదానిపై ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ నెల 20 తర్వాత తానే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తానని వెల్లడించారు. ప్ర